# గురుదక్షిణ

-అనంత

"మేము చదువుకునే రోజుల్లో..."

సుమ చేతిలో పెన్ను చేస్తున్న పని మారింది. తన దస్తూరిని మెరుగు పెట్టుకుందీ క్లాసులో. చెప్పేవి రెండో మూడో పాయింట్లు. తెగ సాగదీస్తాడు. ఈ లోపల నెమ్మదిగా చెక్కినట్లు రాసుకోవచ్చు. ఎంతో అందంగా రాస్తున్న సుమ రాయటం ఆపి, ఒక బొమ్మ గీసింది. ఆ బొమ్మ ముఖంలో విషాదం, కన్నీటి చారికలు. కింద 'పాపం సుమ' అని కాప్షన్ రాసింది అందంగా. పుస్తకం పక్కకి జరిపి, అటు పక్కనున్న శిల్పని నెమ్మదిగా పొడిచింది పెన్నుతో. ఏమిటన్నట్టు చూసి, సుమ బొమ్మని చూసి, "ఓస్! ఇంతేనా?" అన్నట్టు కళ్లెగరేసి చూసి, తన నోట్సు జరిపింది చూడమన్నట్టు. తల వేలాడేసి, నాలిక బయటపెట్టినట్టున్న బొమ్మ కింద "అయ్యో! శిల్ప! డెడ్"! అని రాసి ఉంది. సుమ తన బొమ్మ కన్నీళ్ళని ఇంకా కిందకి కారినట్టూ... కాలవలు కట్టినట్లూ.. పెద్ద చెరువయినట్టూ... వేస్తూ కాలక్షేపం చేస్తోంది. శిల్ప తన బొమ్మకి రకరకాల అలంకారాలు చేస్తోంది.

మధ్యలో ఉన్న శుభకి వాళ్ళిద్దర్నీ చూస్తే జాలేసింది. తలెత్తి చూసింది. క్లాసులో అందరి పరిస్థితీ అంతే. వస్తున్న ఆవులింతలు ఆపుకుంటున్న వాళ్ళూ, మూతలు పడుతున్న కనురెప్పల్ని బలవంతాన పైకి లేపుతున్న వాళ్ళూ, మొహంలో చికాకూ, విసుగు ప్రకటన కాకుండా ప్రయత్నిస్తున్న వాళ్ళూ, లేదా తలొంచుకుని, శిల్ప, సుమల్లాగా ఏదో రాతలతో తంటాలు పడుతున్నవాళ్ళూ...

ఆ మహానుభావుడి వాక్ప్రవాహం సాగిపోతోంది. శిల్ప మరీ చికాకు పడిపోతోంది. ఇద్దరి పుస్తకాలూ తీసుకుంది శుభ. ఇద్దరి బొమ్మలకీ చక్కగా మీసాలు పెట్టింది. సుమకి కోరమీసాలు. శిల్పకి నిమ్మకాయలు నిలబెట్టే బుంగ మీసాలు. ఇద్దరికీ కోపం వచ్చింది. దాంతో లెక్చరర్ మీద విసుగు తగ్గింది.

లంచ్ టైం అయింది. దాటింది కూడా. ఇంకొంచెం సేపుంటే మధ్యాహ్నం క్లాసులు మొదలు. ఇవాల్టికి లంచ్ లేనట్టే. అందరి కడుపుల్లోనూ ఎలుకలు పరుగెడుతున్నాయి. అవి పందికొక్కులయ్యాయి. ఆపై సింహాలై గర్జిస్తున్నాయి. రెండవటానికి పదినిముషాలుంది.

"... ఇలా ఉండేవి శిక్షలు. అందుకే మాకు లెక్చరర్లని ఎదిరించాలంటే భయం ఉండేది. మీలాగా కాదు. ఇంక ఆపుతాను. నాకు ఆకలవుతోంది. పాపం! మీకు ఇవాళ లంచ్‌కి టైం ఉన్నట్టేలేదు. సర్లెండి. ఏం చేస్తాం? రేపటి క్లాసుకి బాగా ప్రిపేర్ అవండి" అంటూ ఒక ట్రయం ఫెంట్ (విజయదర్పాన్ని సూచించే) నవ్వు నవ్వి నిష్క్రమించారు. చరిత్ర చతురాసన, వదరుబోతు వక్రానన నందనరావ్ మాస్టారు భోజనం మిస్ అయినా, అప్పటికయినా వదిలినందుకు సంతోషించింది క్లాసు అంతా.

"మా బొమ్మలకి మీసాలెందుకు పెట్టావు మిస్సమ్మా?" శిల్ప, సుమ ఒక్కసారిగా విజృంభించారు శుభమీద. "ఈ పౌరుషం మీకు రావాలనీ, ఈ బాధల నుండి విముక్తి కావాలనీ..." అంది శుభ. ప్రశ్నార్థకం మొహాలు పెట్టారిద్దరూ. "సాయంత్రం చెపుతాలే" అంది శుభ.

❖ ❖ ❖

రెండు నెలలుగా ఒక్క క్లాసు తీసుకోని రోశయ్య గారు "ప్రైవేట్ క్లాసులు తీసుకుంటున్నాను, అన్ని రోజుల అటెండెన్సూ ఈ మూడు రోజులూ అటెండ్ అయిన వాళ్ళందరికీ" అని చెప్పేసరికి - శనివారం ఆదివారం, సోమవారం ఏదో పండగకిచ్చే సెలవు కలిసి మూడ్రోజులు సెలవలు వచ్చాయని పెట్టుకున్న ఊరు ప్రయాణాలు మానుకుని, రిజర్వేషన్లు కాన్సిలు చేసుకుని కూర్చున్నారు అంతా. శనివారం అంతా ఎదురు చూశారు. రోశయ్య గారు రాలేదు. ఆదివారం కూడా అంతే! సోమవారం కొంతమంది బద్ధకించారు. ఎలాగూ ఇవాళ కూడా ఆయన రారులే అనుకుని లైబ్రరీ కన్నా వెడదామనే ఉద్దేశంతో. రెండున్నరకి నెమ్మదిగా తాంబూలం నములుతూ వచ్చి క్లాసు నిండుగా లేనందుకు తిట్టి, రేపు నాలుగ్గంటలకి అందరూ వెయిట్ చెయ్యండి. మీ క్లాస్‌మేట్స్ అందరికీ చెప్పండి. స్పెషల్ క్లాసు తీసుకుంటాను" అని క్లాసులోకి అడుగు కూడా పెట్టకుండా వెళ్ళిపోయారు.

మంగళవారం సాయంత్రం మూడు యాభైకీ క్లాసు గుమ్మం దగ్గిర నిలబడి, నాలుగింటికి అప్పటివరకున్న ప్రసాద్ సర్ క్లాసు వదలగానే, లోపలికి అడుగుపెట్టి, "మీకు క్లాసు సెమినార్. హాల్లో, ఇక్కడ కాదు, ఫాలోమి" అని, తన ముందు వెళ్ళకుండా నిలబడి, అందరినీ పంపి, ఆయన వెనకాల వెడుతుంటే గొర్రెల కాపరిలాగా

ఉన్నారు. అందరినీ సెమినార్ హాల్‌లోకి పంపి, తను మాత్రం ఎంట్రన్స్ దగ్గర ఉన్న కుర్చీలో కూర్చున్నారు. సాయంత్రం ఎనిమిది గంటల వరకు మెరైన్ ఇంజనీరింగులో ఒక యాస్పెక్ట్ మీద జరిగిన సెమినార్ అంతా విని, స్లైడ్స్ చూసి, కళ్ళలో ప్రాణాలతో బయటపడ్డారంతా. ఎనిమిదింటికి మెస్ మూసేసి ఉంటారు. సెమినార్ అయినాక, అందరూ బయటికి వచ్చేదాకా ఆగి,

"సెమినార్ ఎలా ఉంది? ఈ సబ్జెక్ట్ మీకు అవసరం లేదనుకోండి మీరు బాగా ఎంజాయ్ చేసి ఉండాలే!" అంటూ గబగబా అంగలేసుకుంటూ వెళ్ళిపోయారు రోశయ్యగారు.

తిట్టుకోటానికి కూడా ఓపికలేక, తిండి లేకపోవటం వల్ల నీరసంగా నడుస్తున్న వాళ్ళతో నెమ్మదిగా అంది శుభ "మీసాలు" అని

"ప్రాక్టికల్స్, ఇంటర్నల్స్ వాళ్ళ చేతుల్లోనే ఉంటాయిగా. ధైర్యం ఎవరికి?" విరక్తిగా అంది సుమ.

"అంటే, నేను చెప్పేది బుర్రకెక్కలేదన్నమాట" శుభ అంది విసుగ్గా.

"ఏమో! భయంగా ఉంది."

"ధైర్యే సాహసే లక్ష్మీ!" అంది శుభ నవ్వుతూ.

"కాదే, ధైర్యే సాహసే సుబ్బలక్ష్మీ!" అంది శిల్ప.

శుభని వాళ్ళు సుబ్బు, సుబ్బమ్మ, సుబ్బలక్ష్మి అంటూ ఉంటారు ముద్దుగా.

"పొగడ్తలు కాదే, క్రియ కావాలి."

"ఆలోచిస్తాం" అన్నారిద్దరూ.

❖ ❖ ❖

ఊరిచివర మామిడి తోపులో ఉదయం పది గంటలకల్లా అందరూ చేరారు – ఆరుగురు లెక్చరర్లు, పదిమంది పూర్వ విద్యార్థులూ. వాళ్ళంతా డిగ్రీ పూర్తిచేసి నాలుగు నెలలే అయింది. అందులో నలుగురికి ఉద్యోగాలు వచ్చిన సందర్భంగా కృతజ్ఞతా సూచకంగా చిరువిందు ఇస్తున్నామని, గురుదక్షిణగా భావించమని ఎంతో ఆప్యాయంగా పిలిస్తే– ఇంతకు ముందు ఇటువంటివి ఎరుగరేమో, ఎంతో సంతోషంగా అంగీకరించారు – వందనరావ్, రోశయ్య, ముకుందప్ప, రాఘవన్, శ్రీనివాసమూర్తి, శివకుమార్. అందరితోనూ "ఈ విందు మీ గౌరవార్థమే! మిగిలిన వారిని లంచ్‌కి మాత్రమే పిలుస్తున్నాం. తప్పక అంగీకరించాలి" అంటూ ప్రాథేయపడిన లెవెల్లో అడిగితే పొంగిపోయారు. "పిలిచింది మేము. తీసుకెళ్ళటం, తిరిగి దింపటం మా బాధ్యతే" అంటే ఉబ్బి తబ్బిబ్బు అయ్యారు.

ఆదివారం ఉదయం ప్రతి వారిని ఇంటి దగ్గిరే దండవేసి (కుటుంబ సభ్యులు చూడాలిగా) సగౌరవంగా టాటా సుమోల్లో ఎక్కించుకుంటే నేలమీద లేరు. అందరూ విదేశాల్లో విహారం చేశారు. టాటా సుమో ఆగగానే ఇండియాలోకి దిగబడిపోయారు, "అబ్బా! అరగంట ప్రయాణమా? తెలియలేదు" అంటూ.

చెట్ల కింద జంబుఖానాలు పరచి ఉన్నాయి. పక్కనే పెప్సి, కోక్, థమ్సప్, ఫాంటా మొదలైనవి పేర్చి ఉన్నాయి. చిప్స్, బిస్కట్స్, స్వీట్లు లాంటి తినుబండారాలు పేర్చి ఉన్నాయి.

"స్వాగతం! సుస్వాగతం!! మా 'గురూ'లకి అన్నాడు కృష్ణమోహన్.

"చరిత్ర చతురానన, వదరుబోతు వక్రానన, నక్రశ్రేష్ఠ, వందనరావ్ మాస్టారికి స్వాగతాంజలి" అంటూ ఒక్క గులాబీ ఇచ్చి వెళ్ళాడు – రవికాంత్. "నేను చెప్పే సబ్జెక్ట్ చరిత్రకాదు కదా! ఇతడిలా అంటాడేమిటీ?" అని అనుమానం వచ్చినా పెద్దగా పట్టించుకోలేదు. థాంక్సు చెప్పారు వందనరావ్ మాస్టారు.

"ఎలర్జీల మెటలర్జీలో ఎల్లాయ్‌లా ప్రకాశించే ఉక్రోశయ్య (ఉక్కు రోశయ్య) గారికి స్వాగతం" అంటూ ఒక్క గులాబీని ఆయనకి ఇచ్చి వెళ్ళాడు శరత్. "నా సబ్జక్ట్ మెటలర్జీ కాదే! అయినా ఇతను నా స్టూడెంటు కాదుగా. అందుకని సరిగా తెలిసి ఉండదు" అని సర్ది చెప్పుకున్నాడు థాంక్సు చెపుతూ.

"ఘుమఘుమల ఘ్రాణ ప్రవీణా! అపరాధ పరిశోధనా ఘనా! ముక్కుందా అప్పా! సార్! వెల్‌కం" ఏ అమ్మాయి, ఏ అబ్బాయి, ఎప్పుడు, ఎక్కడ, ఎన్నిసార్లు కలుసుకున్నారో కనుక్కున్నందుకిచ్చిన బిరుదన్న మాట అనుకుని ఇచ్చిన గులాబీ పుచ్చుకుని మరి మాట్లాడలేదు.

"తైలాభిషేక ప్రియా! కేశాభిమానీ! జిడ్డు చక్రవర్తీ! సమవర్తీ! శ్రీ'నివాసమూర్తీ'! శ్రీని'వాసన'మూర్తీ! సారీ! శ్రీనివాసమూర్తిసార్‌కి స్వాగతం. "చేతికిచ్చిన ఎర్రగులాబీ నునుపులో నాల్గు రోజుల క్రితం నూనె ఓడుతూ వచ్చిన థర్డ్ ఇయర్ విద్యార్థుల ముఖాల జిడ్డు కనిపించింది. నూనె రాసుకోటం ఫాషన్ కాదని, చిర్రజుట్టుతో ఉండి, చికాకు కలిగిస్తున్న తన పిల్లలని ఏమీ అనలేక, వాళ్ళకి కూడా బట్టతల వస్తుందేమోననే భయంతో చికాకుగా క్లాసుకి వచ్చి, అందరు పిల్లల తలలూ అలానే ఉండటంతో, కోపంతో రెచ్చిపోయి, రేపటి క్లాసుకందరూ నూనె రాసుకుని వస్తేనే పాఠం చెపుతాను అంటూ తన బట్టతల సవరించుకుంటూ వెళ్ళిపోవటం, మర్నాడు అందరూ మొహాల నిండా కారెట్లు నూనె రాసుకు రావటం, తను వాళ్ళని "గుడ్! కీపిటప్!" అని అంటే, అది మెచ్చుకోలే, వెక్కిరింతో తెలియక, వాళ్ళు

వెర్రిమొహం వెయ్యటం తళుక్కుమని, మనస్సు కలుక్కుమంది. ఎడంచేత్తో బట్టతలని సవరించుకుంటూ, కుడిచేత్తో పువ్వందుకుని జిడ్డుగారే వెర్రి నవ్వుతో "గుడ్! థాంక్యూ!" అన్నారు శ్రీనివాసమూర్తిగారు.

"విద్యార్థి భవితవ్య వన ధనా ధన విధ్వంసన చణ! విదూర పావన జీవన! శ్రీరాఘవన్ గారికి వణక్కం" అంటూ వంగి మరీ నమస్కరించాడు గులాబి పువ్వు ఇచ్చాడు విక్రం. ఫైనల్ సెమిస్టర్ ప్రాక్టికల్ పరిక్షలు తన ప్రయాణం కారణంగా ఒక గంట ముందుకి జరిపిస్తే, వరసగా వచ్చిన సెలవల కారణంగా, ఆ సంగతి తెలియని ఫస్ట్ బాచ్ స్టూడెంట్లు యథాప్రకారం పదింటికి లాబొరేటరీకి వస్తే – 'తొమ్మిదింటికి ప్రాక్టికల్స్ మొదలవుతాయని తెలియదా?' అంటూ విరుచుకుపడటంతో ఊరుకోక, మళ్ళీ పరీక్ష కండక్ట్ చెయ్యననటం, ఫైనలియర్ కదా, ఒక సంవత్సరం వృథా అవుతుందనే భయంతో, వాళ్ళు తనని ప్రాదేయపడటం, కాదంటే వాదించటం, వేరే బాచ్ స్టూడెంట్లు, ప్రిన్సిపాల్తో చెపుతాననటం, తనకీ పౌరుషం వచ్చి ససేమిరా అని భీష్మించుకోవటం ఇరువైపులా తెగేదాకా లాగటంతో, వాళ్ళు సప్లిమెంటరీ రాయాల్సి వచ్చి వాళ్ళ కెరీరు అడుగంటటం గుర్తు వచ్చింది. వాళ్ళల్లో ఎవరైనా ఇక్కడ ఉన్నారా కొంపతీసి– అనుకుంటూ వాళ్ళని పరిశీలనగా చూశాడు. సప్లిమెంటరీ ఇంకో నాలుగు రోజుల తర్వాత, వీళ్ళందరికీ జాబ్స్ వచ్చాయిగా! అదేం అయ్యుండదని ధైర్యం వచ్చింది.

"శిష్య పరమాణు జీవన పరమాణూకృత, విద్యాపరంతప, శ్రీ 'శవ' కుమార్ గారికి సాదర స్వాగతం'' అంటూ రోహిత్ ఇచ్చిన గులాబి అందుకుంటూ సందేహాంబుధిలో మునిగాడు శివకుమార్. ఈ సంవత్సరం నాలుగు జీవితాలు మటాష్ అవటానికి కారణం నేనేనని వీళ్ళు పసిగట్టారా? అన్న అనుమానం తలెత్తింది. కాని, వాళ్ళలో ఎవరూ ఇక్కడ లేరు కదా! అది తన అనుమానమేలే అని సరిపుచ్చుకున్నాడు. కాని, రోహిత్కి తన క్లాస్ మేట్స్ సునంద, శ్రీకాంత్, హరి, మనోజ్ మనసులో మెదిలారు.

వీసా వచ్చి, ట్యులేన్ యూనివర్సిటీలో ఎయిడ్తో సహా సీటు వచ్చి, రిజల్ట్సు రావటంతో ప్రయాణం అని అందరికీ స్వీట్సు పంచింది సునంద. పాపం! ఆ పిల్లకేం తెల్సు, ఆ యూనివర్సిటీలో సీటు కోసం చేసిన ఈ మహానుభావుడి ప్రయత్నం విఫలమైన సంగతి? అందుకే వైవాలో. ఒకే ఒక ప్రశ్నకి జవాబు కోసం తడుముకుంటే "నీ బాయ్ ఫ్రెండ్ డ్రెస్‌కి మాచ్ అయ్యే డ్రెస్ వేసుకుని తిరగటానికి టైం ఉంది గాని, చదవటానికి నీకు టైంలేదు" అని ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ దగ్గర నీచంగా మాట్లాడాడు, ఆ అమ్మాయికి పై చదువుల మీదే శ్రద్ధ తప్ప ఇటువంటి వ్యవహారాలు లేవని తెలిసికూడా. పైగా ప్రాక్టికల్సులో మినిమమ్‌కి తగ్గించి మార్కులు వేయటంతో సునంద ఫెయిల్ అయింది. ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్ చేసే అవకాశం హుష్ కాకి. శ్రీకాంత్, హరి, మనోజ్‌లకి కాంపస్ సెలక్షన్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన బహుళజాతి సంస్థలలో నెలకి యాభైవేలకి పైగా జీతంతో ఎంపికైతే – వారిగతీ అంతే! పరీక్షతో పాటు ఉద్యోగం కూడ గంగపాలే. తలుచుకుంటే కడుపు మండుతోంది. నాలుగు నిండు జీవితాలని సర్వనాశనం చేసినందుకు. వాళ్ళ నలుగురికీ చదువు తప్ప ప్రపంచం తెలియదు. వాళ్ళ లక్ష్యాలే వేరు. వాళ్ళూ, వాళ్ళ కుటుంబ సభ్యులూ మానసికంగా ఎంత కుంగిపోయారో? ఈ అసూయాపరుడుకి అవేవీ పట్టవు. మిత్రబృందం అందరికీ కోపంతో కళ్ళు ఎర్రబడ్డాయి. కాని, తమాయించుకున్నారు.

అందరూ తమ తమ స్థానాల్లో కూర్చున్నారు.

"అందరికీ మరొక్కసారి స్వాగతం పలుకుతున్నాను. మా ఆహ్వానాన్ని మన్నించి, ఇక్కడికి వచ్చినందుకు అందరికీ కృతజ్ఞతలు. ఇంక ఈనాటి కార్యక్రమం ప్రారంభిద్దాం" అని అవతలికి వెళ్ళిపోయాడు కృష్ణకుమార్.

"ఇప్పుడు కొంచెం సేపు సాంస్కృతిక కార్యక్రమాలు. ముందుగా లలిత సంగీతం" అని వెళ్ళిపోయాడు శరత్.

రోహిత్ టేప్‌రికార్డర్ ఆన్‌చేసి, వెళ్ళిపోయాడు. పాత సినిమాల్లో. ఎల్లార్ ఈశ్వరి పాటలన్నీ రికార్డు చేసి తెచ్చిన స్పెషల్ కాసెట్ అది.

"సార్! ఈ పాటలు వింటూ పేకాడుకోండి సార్! మేము మీ భోజనాల ఏర్పాట్లు చూస్తాము" అని కొత్తపేక సెట్ ఇచ్చి వెళ్ళిపోయాడు విక్రమ్.

ఇలా అందరూ తలొక పని మీద వెళ్ళిపోతే మిగిలింది లెక్చరర్లే. ప్రత్యేకంగా ఎన్నిక చేసిన చౌకబారు పాటలు వింటూ పేక తీసి ఆడడం మొదలుపెట్టారు. కాని, ఎవరికీ సరిగా రాదు. అలవాటు లేదు. దాంతో విసుగొచ్చింది. లేచి, అటూ ఇటూ తిరుగుతుంటే దూరంగా విద్యార్థులు హాయిగా చిప్స్, బిస్కట్స్ తింటూ, పెప్సీలు, కోక్‌లూ తాగుతూ కనిపించారు. వాళ్ళని పిలిచి తమకీ ఇయ్యమనే చనువులేదు. వాళ్ళు ఇచ్చేట్లు కనపడలేదు. మొహమాటంగా మళ్ళీ వెనక్కి వచ్చారు. ఇంతలో పవన్ వారికి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చి కొద్దిసేపట్లో అన్నీ రెడీ అని చెప్పి, కాసెట్ మార్చి వెళ్ళాడు. "ఓ తోడు లేని చెల్లి..." అంటూ యాభై ఏళ్ళ నాటి విషాద గీతం ఆలపిస్తోందది. ఇంతలో సూరిబాబు వచ్చి

"కొద్దిసేపు ఓపిక పట్టండి సార్!" అని చెప్పి వెళ్ళాడు.

పది నిమిషాల్లో రమేష్ వచ్చి "సారీ సర్స్!... ఆలస్యం అవుతోంది క్షమించండి" అని తుర్రుమన్నాడు.

రెండు గంటలు దాటింది. అందరికీ నకనకలాడుతోంది. నీరసం, కోపం, నిస్సహాయత. అనైకమత్యం సహజ లక్షణం కావడంతో ఎవరికి వారే బాధపడుతున్నారు. నీరసంగా వాలిపోతున్నారు.

విద్యార్థి బృందం కలకలారావాలు వాళ్ళని మళ్ళీ మామూలు ప్రపంచంలో పడేశాయి.

"మమ్మల్ని క్షమించాలి. కొంచెం ఆలస్యం అయ్యింది. కాని, మా చేతుల్లో లేదుసార్. మీకు ఆ బాధ తెలియకుండా, ఇప్పుడు కాసేపు మిమిక్రీ ప్రోగ్రాం. దయచేసి ఆనందించండి."

సూరిబాబు ముందుకి వచ్చాడు. అంతా చప్పట్లు చరిచారు. లెక్చరర్లూ నీరసంగా చప్పట్లు కొట్టారు. సూరిబాబు గొంతు సవరించుకుని మొదలుపెట్టాడు.

"మేం చదువుకునే రోజుల్లో స్కూళ్ళలో కుర్చీలూ, బల్లలూ ఉండేవి కావు. అప్పుడు... ఇంక ఆపుతాను. నాకు ఆకలవుతోంది పాపం! మీకు ఇవాళ లంచ్ ప్రాప్తం లేదు. ఏం చేస్తాం? చేసుకున్న వారికి చేసుకున్నంత."

అందరూ చప్పట్లు కొట్టారు. వందనరావ్ ముఖం మాడిపోయింది. లేవబోయి, మర్యాద కాదని ఆగిపోయాడు.

సూరిబాబు మళ్ళీ మొదలుపెట్టాడు. "ఇప్పుడు మరో ఐటమ్. ఈ మెరైన్ ఇంజనీరింగు మీకు పనికిరాదనుకోండి. అయినా, బాగా ఎంజాయ్ చేసి ఉంటారు. పాపం! డిన్నర్ టైం దాటిపోయింది. మెస్ క్లోజ్ చేసి ఉంటారేమో! ఏం చేస్తాం?"

విద్యార్థుల చప్పట్లు రోశయ్య గారి ముఖం మీదే మోగినట్లనిపించింది.

"ఏం సుశీలా! నువ్వూ ఫైనల్ ఇయర్ శేఖరూ అభిరుచిలో వారానికి రెండుసార్లు డిన్నర్‌లు చేస్తున్నారు. లైబ్రరీ దగ్గర పదిహేనుసార్లు కలిశారు. రైల్వే స్టేషను నించి అయిదుసార్లు కలిసివచ్చారు. మీ వ్యవహారం ఏమీ బాగుండలేదు. జాగ్రత్త!" కాస్త ముక్కుతో మాట్లాడితే ముకుందప్ప మాట్లాడినట్లే ఉంది. చప్పట్ల హోరు మధ్య రోహిత్, "అన్నా చెల్లెళ్ళం. కలిసి రాకపోతే ఎవరొస్తారోయ్?" అన్నాడు.

ముకుందప్ప ముఖం మాడిపోయింది.

"గుడ్! కీపిటప్! మగ పిల్లలన్నాక తలకి ఈ మాత్రం నూనె పట్టించకపోతే క్లాత్ హెడ్ అయిపోతుంది."

శ్రీనివాసమూర్తి ఎడం చెయ్యి అప్రయత్నంగా బట్టతలని నిమిరింది.

"నా ప్రయాణం కోసం మీ పరీక్ష ప్రిపోన్ చేస్తే తెలుసుకోవాల్సిన బాధ్యత మీది కాదా? అజ్ఞానానికి ఫలితంగా మీ బాచ్ డిగ్రీ తీసుకోటానికి ఆరునెలలు ఆగాల్సిందే!" కీచుగొంతు ఎవరిదో అందరికీ తెలుస్తూనే ఉంది. "అయ్యయ్యో" అంటూనే లయబద్ధంగా చప్పట్లు కొట్టారు.

"సునందా! నేను చదవాలనుకున్న ట్యులేన్ యూనివర్సిటీలో సీటు తెచ్చుకుని నాకు స్వీటు ఇస్తావా? అందుకే నువ్వు ఫెయిల్ వైవాలో. ఏరా శ్రీకాంత్! హరీ! మనోజ్! మాకన్నా ఎక్కువ జీతాలతో మీకు ఉద్యోగాలా? చూస్తాగా, ఎట్లా జాయిన్ అవుతారో?.." అందరూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ లెక్చరర్ల చుట్టూ తిరుగుతున్నారు.

మూడు గంటలయ్యింది, అందరికీ అవమానం. ఆకలి. అసహాయ స్థితి. కృష్ణకుమార్ అన్నాడు. "సర్స్. మీరంటే మాకెంతో గౌరవం ఉండేది. ఇకముందు కూడా ఉండాలంటే... మీ పద్ధతులు మార్చుకోండి. ఈ పాటికి మా ఉద్దేశం మీకు అర్థం అయే ఉండాలి. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేయండి. మీ ప్రవర్తన వల్ల విద్యార్థులకెంత హాని కలుగుతుందో ఊహిస్తే, ఇలా ప్రవర్తించి ఉండేవారు కాదు. అందుకే మీకు సున్నితంగా తెలియచెప్పాలని ప్రయత్నించాం. మీరు నెమ్మదిగా ఆలోచించుకుని, మా తరువాతి బాచెస్‌ని అయినా ప్రేమగా చూస్తారని మా ఆశ. ఏది ఏమైనా మీరు మా గురువులు కనక మా కృతజ్ఞతలు. నమస్కారం. వెళ్ళొస్తాం సార్!" అంటూ గబగబా అందరూ టాటా సుమోల్లో ఎక్కారు. ఎప్పుడు సర్దారో తెలియదు తినుబండారాలూ, జంబుఖానాలూ అన్నీ మాయం. తెల్లబోయి చూస్తున్న వాళ్ళ కళ్ళకి సుమోలు రేపిన దుమ్ము మాత్రమే కనపడుతోంది.

❖ ❖ ❖

సాయంత్రం ఏడు గంటలకి కాలేజ్ లాన్స్‌లో ట్యూబ్‌లైట్స్ వెలుగులో ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ అంతా కలిసి కృతజ్ఞతతో ఇచ్చిన విందులో పాల్గొన్న కృష్ణకుమార్ బృందం, పగలు మామిడితోపులో జరిగిన సన్నివేశాలు చెపుతుంటే అందరూ ఆనందిస్తున్నారు. శుభ "మీసాలు" అంది నెమ్మదిగా.

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004.